సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 11 । నవంబర్ । 2024



తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

ఏజెన్సీలో పాడేరు, చింతపల్లి, అరకులోయ, హుకుంపేట, పెదబయలు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో ఆదివారం పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. చలిగాలుల ప్రభావం కనిపించింది. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 17డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 17.2 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 17డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

ఘాట్‌లో బుల్లెట్ దగ్ధం

- వంజంగి హిల్స్‌కు వెళ్తుండగా వేడెక్కిన ఇంజిన్
- ఒక్కసారిగా ఎగసిన మంటలు
- దూకేసి ప్రమాదం నుంచి బయటపడిన పర్యాటకులు



మంటల్లో తగలబడుతున్న బుల్లెట్ వాహనం

పాడేరు : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి మేఘాల కొండకు వెళ్లే ఘాట్ మార్గంలో ఆదివారం తెల్లవారు జామున ఓ బుల్లెట్ దగ్ధమైంది. ఇద్దరు పర్యాటకులు వంజంగి మేఘాల కొండకు బుల్లెట్‌పై బయలుదేరారు. ఘాట్ మార్గంలో వెళ్తుండగా ఇంజిన్ వేడెక్కడంతో ఒకసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వారు వెంటనే బైక్ పైనుంచి దూకేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అయితే దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపారు.

అనుమతి ఉన్నచోటే ఇసుక తవ్వకాలు

- రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్



అడ్డతీగల: ఏజెన్సీలోని అనుమతి ఉన్న వాగుల్లో మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలని రంపచోడవరం డీఎస్పీ జి.సాయిప్రశాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండలంలోని బొంగరాలపాడు వద్ద ఏలేరు వాగులో ఇసుక సేకరణకు వెళ్లిన నలుగురు మునిఇ మృతి చెందారన్నారు. రంపచోడవరం డివిజన్‌లో వాగులు, కాలువల్లో ఇసుక సేకరించడానికి తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే ఇసుక తవ్వకాలు, సేకరణ చేపట్టాలని సూచించారు. ఈత రానివారు వాగులు, నదుల్లోకి ఇసుక సేకరణకు దిగరాదన్నారు. చీకటి సమయంలో నదులు, వాగులు, నదీ పాయల్లోకి ఇసుక సేకరణకు వెళ్లరాదన్నారు. ఇసుక సేకరణ చేపట్టినప్పుడు నదులు, వాగుల్లోకి తాడు సాయంతో దిగాలన్నారు. ప్రభుత్వం అనుమతి లేనిచోట ఇసుక తవ్వకాలు జరపరాదన్నారు.ఇసుక సేకరణకు వెళ్లేటప్పుడు అక్కడి భౌతిక పరిస్థితులు తెలుసుకోవాలని డీఎస్పీ సూచించారు.

160 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు



పట్టుబడిన గంజాయి నిందితులతో మోతుగూడెం పోలీసులు

మోతుగూడెం: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ కె.శివనారాయణ తెలిపారు. గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసులు సాయంత్రం నాలుగు గంటల సమయంలో తనిఖీలు చేపట్టారు. ఒడిశాలోని మలకన్‌గిరి జిల్లా పెద్దపాకల నుంచి మహారాష్ట్రలోని ముంబైకి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 160 కేజీల గంజాయి పట్టుబడినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో శుభం దాల్వి, రోహన్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు ఆయన వివరించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.8 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. వ్యాన్, రెండు మొబైళ్లను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

మే నెలలో జోలాపుట్టు గ్రామ సమీపంలో తనిఖీ చేస్తున్న పోలీసులు సమీప కొండ ప్రాంతంలో కొంత మంది యువకులు గుమిగూడి ఉండటాన్ని గమనించారు. వెంటనే అక్కడికి వెళ్లి చూసేసరికి వారు పారిపోయారు. అక్కడ గంజాయి తాగేందుకు కూల్ డ్రింక్ బాటిళ్లకు అమర్చిన నాజిల్‌ను గుర్తించారు.

ఆగస్టులో ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతమైన దుడుమ వద్ద సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయసు గల నలుగురు యువకులు గంజాయి తాగుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న మాచ్‌ఖండ్ పోలీసులు వారిని పట్టుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ముంచంగిపుట్టు మండలంలో బూసిపట్టు పంచాయతీ కేంద్రం సమీపంలో గతేడాది డిసెంబర్‌లో జరిగిన బైక్ ప్రమాదంలో ఒడిశాలోని జనభ గ్రామానికి చెందిన 24ఏళ్ల యువకుడు మృతి చెందాడు. అతని బైకులో గంజాయి సిగరెట్లను గుర్తించిన పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు.

మత్తుకు బందీ

ఆంధ్రా ఒడిశా సరిహద్దులో గంజాయికి బానిస అవుతున్న యువత

- పెడతోవ పడుతున్న బాల్యం
- ఏవోబీ సరిహద్దులో పెరుగుతున్న వ్యసనం
- గుర్తించిన పోలీసులు
- అనర్థాలపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్
- తల్లిదండ్రులు దృష్టి పెట్టకపోతే చేయిదాటిపోయే ప్రమాదం

> ఈ ఏడాది మార్చిలో ఆరుగురు యువకులు గంజాయి తాగుతూ పెదబయలు పోలీసులకు పట్టుబడ్డారు. వారు మైనర్లు కావడంతో తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ చేశారు. గంజాయి వల్ల జీవితాలు పాడైపోతాయని వారికి తెలియజేసి పంపించారు.





గంజాయి తాగేందుకు ప్లాస్టిక్ బాటిల్‌కు యువత అమర్చిన నాజిల్

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా సరిహద్దులో యువత చెడుదారి పడుతున్నారు. గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. సిగరెట్, మద్యం సేవించడం ఫ్యాషన్‌గా ఫీలయ్యే వీరు గంజాయి మత్తుకు లోనవుతున్నారు. వీరిలో ఎక్కువగా మైనర్లతోపాటు ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటున్నారు.

- మత్తుకు అలవాటు పడిన యువతకు కొందరు ముఠాగా ఏర్పడి గంజాయి సరఫరా చేస్తున్నారు. దీంతో సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు,మాచ్‌ఖండ్ పరిసర ప్రాంతాల్లో చాపకింద నీరులా గంజాయి రవాణా జరుగుతోంది.
- గంజాయి మత్తుకు అలవాటు పడిన వారిలో ఎక్కువగా మైనర్లు ఉన్నట్టుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటికే వీరిలో మార్పుకోసం మారుమూల గిరిజన గ్రామాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.
- సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి మత్తుకు బానిస అవుతున్న యువత సరిహద్దులోని జోలాపుట్టు తదితర ప్రాంతాల్లో నిర్మానుష్యమైన ప్రదేశాలను ఎంచుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో సేవిస్తూ మత్తుకు అలవాటు పడుతున్నారు.

గంజాయితో సిగరెట్లు

- ముఠా సభ్యులు సరఫరా చేస్తున్న గంజాయితో సిగరెట్లు తయారు చేసుకుంటున్నారు. కూల్ డ్రింక్స్ బాటిళ్లను గంజాయి పీల్చేందుకు అనువుగా మార్చుకుంటున్నారు. బాటిల్‌కు రంధ్రం పెట్టి దానికి సిగరెట్ అమర్చి పైపు ద్వారా పీల్చుతున్నారు. బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో గతేడాది డిసెంబర్‌లో జరిగిన ప్రమాదంలో బైక్‌లో ఉన్న మూడు సిగరెట్లను పోలీసులు గుర్తించారు.
- గంజాయి మత్తులో అదుపుతప్పి గొడవలకు దిగుతున్నారు. ఇలాంటి ఘటనలు మారుమూల గిరిజన గ్రామాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి తల్లిదండ్రులపై దాడులు దిగిన సందర్భాలు ఉన్నాయి.

ఇలా చేస్తే మేలు..

- నిషేధిత గంజాయి విక్రయాలపై పోలీసులు దృష్టి పెట్టాలి. గంజాయి రవాణా చేస్తూ గంజాయి స్మగ్లర్లు పట్టుబడుతున్నారు. అయితే గంజాయిని ప్యాకెట్ల రూపంలో యువతకు విక్రయించే వారు పట్టుబడిన సంఘటనలు తక్కువగానే ఉన్నాయి. ఇలాంటి వారిని గుర్తించాలి.
- జిల్లాలో గత ప్రభుత్వంలో గంజాయి సాగు, రవాణాను పూర్తిగా అరికట్టారు. ఇప్పుడు ఎక్కువగా ఒడిశా నుంచి వస్తుంది. సరిహద్దు ప్రాంతాల్లో సరఫరా చేసే వారిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలి. గంజాయి తాగుతూ పట్టుబడిన వారిని విచారిస్తే సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.
- పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఎప్పుడు వస్తున్నారు.బయట ఏం చేస్తున్నారు అనే దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసులు సూచిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో కూడా పోలీసులు ఇదే విషయాన్ని పదేపదే చెబుతున్నారు.

భవిష్యత్తు నాశనం



గంజాయి తాగుతూ యువత చెడు మార్గం వైపు వెళ్తున్నారు. చిన్న వయసులోనే గంజాయికి బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.రాత్రిపూట స్నేహితులు అంటూ బయటకు వెళ్తే ఒప్పుకోకూడదు. గంజాయి రవాణా, విక్రయాలపై పోలీసులు దృష్టి సారించాలి. – వెంగడ రమేష్, అధ్యక్షుడు, సర్పంచుల ఫోరం, ముంచంగిపుట్టు

జీవితాలను పాడుచేసుకోవద్దు



గంజాయి రవాణాపై దృష్టిపెట్టాం.యువత గంజాయికి బానిస అవుతున్నట్లు కొన్ని సందర్భాల్లో గుర్తించాం.గంజాయి వల్ల కలిగే అనర్థాలపై గిరిజన గ్రామాలు, కళాశాలల్లో యువతకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి మత్తులో పడి జీవితాలను పాడుచేసుకోవద్దని వారికి సూచిస్తున్నాం. గంజాయి రవాణా, మత్తుకు దూరంగా ఉంటే జీవితం బాగుంటుంది. – కె.ధీరజ్, ఏఎస్పీ, పాడేరు

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఐటీడీఏ క్వార్టర్ల సమీపంలో కొలువుదీరిన గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన చేశారు. వర్తక సంఘ ప్రతినిధి ఆదారి ధనలక్ష్మి అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా కార్తీక పూజలు



ఆకాశదీపం పూజల్లో ధర్మకర్త సింహాచలంనాయుడు తదితరులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో కార్తీక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు రామం ఆధ్వర్యంలో ఆకాశదీపం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరకులో జిల్లాస్థాయి యువ ఉత్సవం రేపు

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న జిల్లాస్థాయి యువ ఉత్సవం నిర్వహించనున్నట్లు విశాఖ నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి జి. మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాల నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. ఈనెల 11వ తేదీ ఉదయం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేర్లు నమోదు చేసుకొని పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. జిల్లా స్థాయి గ్రూప్ కల్చరల్ ప్రోగ్రాం, సైన్స్ మేళా, వ్యక్తిగత సైన్స్ మేళా, గ్రూప్ యంగ్ రైటర్స్ కాంపిటేషన్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్ అండ్ కల్చర్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు అవార్డు, నగదు బహుమతి అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

గిరిజన హక్కులపై చట్ట సభల్లో ప్రస్తావిస్తా



ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి నినాదాలు చేస్తున్న గిరిజన విద్యార్థి సంఘ ప్రతినిధులు



హాజరైన ప్రతినిధులు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: గిరిజన ప్రాంత ప్రజల హక్కులపై చట్టసభల్లో ప్రస్తావిస్తానని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివారం విచ్చేసిన అరకు ఎమ్మెల్యే గిరిజనుల హక్కులు, చట్టాలపై వివిధ సంఘాల మేధావులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఐదవ షెడ్యూల్ ప్రాంత గిరిజన ప్రజల కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కుల కోసం ఈనెల 12 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానన్నారు. ముఖ్యంగా జీవో నంబర్ 3, 1/70, పీసా చట్టాలపై మాట్లాడతానన్నారు. ఈ శిక్షణ తరగతులు నిర్వహించిన గిరిజన విద్యార్థి సంఘం నాయకులకు ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు





ప్రమాదానికి గురైన ఆటో, వలసన్న మృతదేహం

పెదబయలు: మండలంలోని అడుగులుపుట్టు పంచాయతీ వడ్డేపుట్టు గ్రామ సమీపంలో మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీపేట నుంచి ప్రయాణికులతో పెదబయలు వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన లక్ష్మీపేట పంచాయతీ కిలుములు గ్రామానికి చెందిన కిల్లో వలసన్న (56) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఆటోలో ఉన్న వళ్లంగి పార్వతమ్మ, బొండ భీమన్న, కిల్లో దొన్నమ్మ, కుర్తాడి బాబురావు, కిల్లో హరిబాబు, బి.గాసన్న, బి.తులసమ్మ, కుర్తాడి చిలకమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం వీరిలో ఇద్దరిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పొద్దుతిరుగుడు తోటలో ఫొటోలు తీసుకుంటూ సందడి



పర్యాటకులతో పాపికొండలు బయలుదేరిన బోటు



పేరంటాలపల్లి శివాలయం వద్ద పర్యాటకుల సందడి

పోటెత్తిన పర్యాటకులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలన్నీ రెండు రోజులుగా సందడిగా మారాయి. పాడేరు ప్రాంతంలోని వంజంగి హిల్స్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు సూర్యోదయం, పొగమంచు, మేఘాల అందాలను వీక్షించారు.

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయకు పర్యాటకులు పోటెత్తారు. రెండవ శనివారం, ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చారు. పద్మాపురం ఉద్యానవనాన్ని శనివారం 800 మంది సందర్శించగా రూ.47,400, ఆదివారం 1850 మంది సందర్శించగా రూ.1.06 లక్షల ఆదాయం వచ్చింది. గిరిజన మ్యూజియంను శనివారం 2,409 మంది సందర్శింగా రూ.1,92,495, ఆదివారం 2,800 మంది సందర్శించగా రూ.1,91,800 ప్రవేశ రుసుం ద్వారా ఆదాయం సమకూరింది.

కూనవరం: పాపికొండల విహారయాత్రకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. శనివారం 784 మంది, ఆదివారం 687 మంది బోట్లలో తరలివెళ్లారు. వర్షాలు, వరదలు, తుపానుల కారణంగా గత మూడు నెలల పాటు నిలిచిపోయిన పాపికొండల విహారయాత్ర, దసరా సెలవుల అనంతరం ఊపందుకుంది.

డుంబ్రిగుడ: పర్యాటకుల రాకతో చాపరాయి జలవిహారి సందడిగా మారింది. అంజోడలోని అరకు పైనరీకి ఆదవారం భారీగా తరలివచ్చారు. దీంతో అరకు–జైపూర్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ నెలకొంది.డుంబ్రిగుడ–కించుమండ మధ్యలోని బిల్లాపుట్టు వద్ద మేఘాల కొండపై పర్యాటకులతో సందడి నెలకొంది.

చింతపల్లి: లంబసింగికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. చెరువుల వేనం వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలిపించే మంచు అందాలను తిలకించారు. తాజంగి జలాశయం వద్ద బోటు షికారు చేశారు. జిప్‌లైన్ ఎక్కి సందడి చేశారు.



చాపరాయి జలపాతానికి తరలివచ్చిన పర్యాటకులు



పద్మాపురం ఉద్యానవనం వద్ద పర్యాటకులు



జారుబంద వద్ద పర్యాటకుల సందడి



అరకు పైనరీకి భారీగా తరలివచ్చిన పర్యాటకులు



చెరువులవేనంలో వ్యూపాయింట్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు



వంజంగిలో మేఘాల కొండపై సందడి చేస్తున్న పర్యాటకులు

అటవీ అమరుల త్యాగాలు చిరస్మరణీయం



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

చింతపల్లి: అటవీశాఖలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని డీఎఫ్‌వో వై.వెంకట నర్సింహరావు అన్నారు. అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం ఆయన ఆధ్వర్యంలో చింతపల్లిలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, లోతుగెడ్డ, పెదవలస రేంజ్ అధికారులు అప్పారావు, పాత్రుడు, శివరంజిని, డీఆర్వోలు పాల్గొన్నారు.

సాక్షి,పాడేరు: అటవీ సంరక్షణ విధుల్లో అమరులైన అటవీశాఖ అధికారులు, ఉద్యోగుల త్యాగాలు చిరస్మరణీయమని అరకు సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక డివిజనల్ అటవీశాఖ కార్యాలయంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినంను ఆదివారం నిర్వహించారు. అటవీ అమర వీరుల చిత్రపటాలకు ఆమెతోపాటు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడేరు అటవీ రేంజి అధికారి వి.లావణ్య.ఇతర సెక్షన్ అధికారులు,బీటు సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక సన్నిధిలో సీలేరు జెన్‌కో సీఎండీ



జెన్‌కో సీఎండీ చక్రధర్‌బాబుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత

అనకాపల్లి: గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారిని ఆదివారం సీలేరు జెన్‌కో సీఎండీ కాండ్రేగుల వెంకట నరేష్ చక్రదర్‌బాబు కుటుంబ సభ్యులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

జాబ్‌మేళా రేపు

మహారాణిపేట(విశాఖ): నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న మహారాణిపేట నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ మేళాలో వీల్స్‌మార్ట్, 2 నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్, పే–టీమ్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు 9676170026 సంప్రదించాలన్నారు.

అలరించిన అర్మాన్ మాలిక్ మ్యూజికల్ షో



కొమ్మాది (విశాఖ): బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో తన పాటలతో అలరించారు. లైవ్ ఇన్ కాన్సెప్ట్ పేరుతో శనివారం రాత్రి జరిగిన సంగీత కార్యక్రమంలో బోల్ దో నా జరా, బుట్టబొమ్మ తదితర పాటలు పాడి యువతను ఉర్రూతలూగించారు. ఆయన పాటలు పాడుతుంటే యువత స్వరం కలుపుతూ, డ్యాన్స్‌లు చేస్తూ ఎంజాయ్ చేశారు.

'మట్కా' అందరినీ అలరిస్తుంది



ఏయూ క్యాంపస్: ప్రాణం పెట్టి రూపొందించిన మట్కా సినిమా అందరినీ అలరిస్తుందని ఆ చిత్ర హీరో వరుణ్ తేజ్ అన్నారు. బీచ్‌రోడ్డులో ఆదివారం రాత్రి నిర్వహించిన చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న చిత్రం విడుదల కానుందని, అందరినీ అలరిస్తుందన్నారు. 1982కి ముందు జరిగిన కథతో చిత్రం ఉంటుందన్నారు. ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహించగా..నిర్మాతగా విజయేందర్‌రెడ్డి వ్యవహరించారు. నటులు నవీన్‌చంద్ర, సత్యం రాజేష్, నట శిక్షకుడు సత్యానంద్, వరుణ్ సతీమణి లావణ్య త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో నగరవాసులు, అభిమానులు ఈవెంట్‌కు హాజరై.. సందడి చేశారు.

కదలివచ్చిన గిరిజనం

- గ్రామాల్లో అధ్వాన రహదారులపై పట్టించుకోని అధికారులు
- శ్రమదానంతో గ్రామస్తుల రోడ్డు మరమ్మతు పనులు
- స్థానికుల హర్షం



గూడూరు, మదుగూరు రహదారిలో శ్రమదానంతో గోతులు పూడుస్తున్న గ్రామస్తులు



రోడ్డులో ఉన్న గుంతలను రాళ్లతో పేరుస్తు శ్రమదానం చేస్తున్న ఆదివాసీ యువకులు

డుంబ్రిగుడ: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఆ గ్రామస్తులంతా ఏకమై సమస్య పరిష్కారానికి ముందడుగు వేశారు. ఏళ్ల తరబడి గ్రామాలకు వేధిస్తున్న రహదారి సమస్యపై సంధించారు. శ్రమదానంతో రోడ్డు పనులకు నడుము బిగించారు. గోతులు పూడ్చి...మట్టితో చదును పనులు చేపట్టి తాత్కాలిక రహదారిని నిర్మించుకున్నారు. జిల్లాలోని అరకు నియోజకవర్గంలో డుంబ్రిగుడ మండలంలోని కొర్రాయి పంచాయతీ కాంగువలస, బరియకాలువలసలోని రోడ్డు పనులకు, రంపచోడవరం నియోజకవర్గం చింతూరు మండలంలోని గూడూరు– మదుగూరు రహదారి మరమ్మతు పనులకు ఆదివారం గిరిజనులు తరలివచ్చి గ్రామాభివృద్ధి కోసం తమ వంతు సాయమందించారు.

మూడు గ్రామాలకు తాత్కాలిక రహదారి

మండలంలోని కొర్రాయి పంచాయతీ కాంగువలస, బరియకాలువలసతో పాటు అరకులోయ మండలం పద్మాపురం పంచాయితీ బొండంగుడ కలుపుతూ మూడు పీవీటీజీ గ్రామాలకు రోడ్డు అనుసంధానం చేస్తూ అధికారులు నిర్మించ చేపట్టిన మట్టి రోడ్డు ఇటీవల వర్షాలతో కోతకు గురై అధ్వానంగా మారింది. దీంతో ఆయా గ్రామాల్లోని 150 కుటుంబాలకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలైన 108 అంబులెన్స్ గ్రామాలకు రాలేని పరిస్థితి నెలకొంది. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. గమనించి ఆదివారం శ్రమదానంతో రోడ్డు పనులు చేసేందుకు నడుము బిగించారు. మూడు గ్రామల యువత కలిసి రోడ్డులో ఉన్న గుంతలను పూడ్చి, చదును పనులు చేసి రోడ్డుని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. డుంబ్రిగుడ మండలం కొత్తవలస నుంచి ఈ మూడు పీవీటీజీల గ్రామలను అనుసంధానం చేస్తూ అరకులోయ మండల పద్మాపురం పంచాయతీని కలుపుతు సుమారు మూడు కిలోమీటర్ల తారురోడ్డు నిర్మించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ఈ సందర్భంగా శ్రమదానంలో మూడు గ్రామల యువత ఎం.లచ్చు, దేముడు, ఎం.శివ, బూడి.లచ్చన్న, కిల్లో ప్రకాష్, కిల్లో సంజీవరావు, కె.సల్ప్, పాంగి సాంబ్రలు ఉన్నారు.

శ్రమదానంతో రహదారులకు మరమ్మతులు

చింతూరు: గోతులమయమైన రహదారులతో ఇబ్బందులు పడుతున్న ఆ గ్రామస్తులు శ్రమదానంతో వాటికి మరమ్మతులు చేపట్టారు. మండలంలోని గూడూరు నుంచి మదుగూరు వెళ్లే గ్రావెల్ రహదారి ఇటీవల భారీ వర్షాలకు పలుచోట్ల కొట్టుకుపోవడంతో పాటు భారీగా గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. దీంతో పాటు గూడూరు నుంచి కొత్తపల్లి వెళ్లే తారురోడ్డులో సైతం పలుచోట్ల గోతులు ఏర్పడడంతో ఇబ్బందిగా మారిందని వారు చెప్పారు. దీంతో గ్రామస్తులంతా శ్రమదానంతో ఆదివారం రెండు రహదారులకు మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రెండు రహదారులకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు సున్నం గౌరమ్మ, సర్పంచ్ మడివి బొజ్జి, సోడె రామయ్య, ఎర్ర బొజ్జి, జోగయ్య, కామేశ్వరరావు, ముత్తయ్య, రాము, వెంకయ్య, రాజయ్య పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

- విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



పెదగూడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ ఛైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



సొంబ్రన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ ఛైర్ పర్సన్ సుభద్ర, నేతలు

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నట్టు విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చెప్పారు. మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో జెడ్పీ నిధులు రూ.15లక్షలతో 200 మీటర్ల సీసీ రోడ్డు, 100 మీటర్ల డ్రైనేజీ పనులకు ఆదివారం జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం కృషి చేయడం జరగుతుందని, జెడ్పీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు వేయడం జరుగుతుందన్నారు. గిరిజనులు కష్టాలన్నీ తనకు తెలుసు అని అందుకే వారికి అన్ని సదుపాయాలు కల్పనే లక్ష్యంగా పని చేస్తానన్నారు. అనంతరం బాకుబెడ, బొరగూడ గ్రామాల్లో ఛైర్‌పర్సన్ పర్యటించి గిరిజనులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మీ, ఎంపీపీ సీతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, పార్టీ మండల అధ్యక్షుడు పద్మారావు, సర్పంచులు బాబూరావు, రమేష్, ఎంపీటీసీ సభ్యులు గణపతి, సుబ్బలక్ష్మి, కమల, నాయకులు మూర్తి, జగన్నాథం, దాసు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సొంబ్రన్న కుటుంబాన్ని పరామర్శించిన జెడ్పీ ఛైర్‌పర్సన్

మండలంలోని సుజనకోట పంచాయతీ గొడుగుల పుట్టు గ్రామాన్ని జెడ్పీ ఛైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సందర్శించారు. గ్రామానికి చెందిన పనసగుడియా సొంబ్రన్న(49) అనే గిరిజనుడు ఇటీవల మత్స్యగెడ్డలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిన విషయం తెలుసుకున్నారు. ఈ మేరకు సొంబ్రన్న కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపి, ఓదార్చారు. జరిగిన ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. సొంబ్రన్న భార్య రంభతో మాట్లాడి బాధిత కుటుంబానికి వైఎస్సార్‌పార్టీ అండగా ఉంటుందని, ఉన్నతాధికారులతో మాట్లాడి ఆదుకొనే విధంగా చర్యలు తీసుకుంటానని ఆమె భరోసా ఇచ్చారు. ఆమె వెంట సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి తదితరులున్నారు.

నిత్యాన్నదానం ఏర్పాటుకు చర్యలు

- మోదకొండమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



ఆలయంలో షెడ్ల పనులను పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, గిరిజన ఆరాధ్య దైవం పాడేరు శ్రీ మోదకొండమ్మ ఆలయానికి దర్శనం కోసం వచ్చే భక్తులకు త్వరలోనే నిత్యాన్నదానం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ ఛైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆదివారం అమ్మవారి ఆలయ పరిసరాల్లో ఖాళీగా ఉన్న స్థలంలో అన్నదానం షెడ్ల నిర్మాణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం భక్తులు, దాతల సహకారంతో వారానికి మూడు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో వారానికి ఒకరోజు మాత్రమే అన్నదానం ఉండేదన్నారు. భక్తులు, దాతల సహకారంతో త్వరలో నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు వసతి సౌకర్యాలపై కూడా చర్చిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఆలయ కమిటీ సభ్యుడు కొణతాల సతీష్ తదితరులున్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్‌పీ, హైందవ సంస్థల ప్రతినిధులు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడిలోని రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం వీహెచ్‌పీ సంఘం ఆధ్వర్యంలో సన్నాహక సదస్సు నిర్వహించారు. వీహెచ్‌పీ నేతలతో పాటు అడ్డతీగల, వై.రామవరం, గంగవరం, రాజవొమ్మంగి మండలాల నుంచి పలువురు హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలన్నారు. హిందూ దేవాలయాలు హిందూ సంస్థలచే నిర్వహించబడాలన్నారు. దేవాలయాలు పూజలకు మాత్రమే కాకుండా విజ్ఞాన నిలయాలు, ఆరోగ్య నిలయాలుగా ఉండాలన్నారు. సేవా కేంద్రాలు, అన్నప్రసాద కేంద్రాలతో పాటు వివిధ కళలకు వేదికలుగా విలసిల్లాలన్నారు. హిందూ దేవాలయాల రక్షణ వ్యవస్థను ప్రభుత్వ అజమాయిషీ నుంచి రక్షించడం, హిందూ సంస్థలకే అప్పగించడం వంటి విషయాలపై అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవాడలో జనవరి 5 నిర్వహించనున్నామని, అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా హైందవ శంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరించారు. వనవాసీ కళ్యాణాశ్రమ్ జిల్లా కార్యదర్శి పొత్తూరి కృష్ణ, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథం, బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రాంత ప్రముఖ్ వెంకటరత్నం, ఖండ్ వ్యవస్థాపక ప్రముఖ్ కృష్ణారెడ్డి, ప్రఖండ్ ప్రతినిధి జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థతత



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న పాముకాటుకు గురైన ధనలక్ష్మీ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాముకాటు బాధితుడు చిలకలజానీ

గూడెంకొత్తవీధి: పాముకాటుకు గురైన వ్యక్తికి సకాలంలో వైద్యం అందించడం ద్వారా అతని ప్రాణం నిలబడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అమ్మవారి దారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందిన చిలకలజానీ శనివారం కాఫీతోటలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. చేతులతో పాటు ఇతర భాగాల్లో పాము కాటేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆర్.వి.నగర్ పీహెచ్‌కి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి అక్కడి నుంచి నర్సీపట్నం తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ ప్రస్తుతం జానీ కోలుకుంటున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ గిద్దులపుట్టు గ్రామానికి చెందిన తమర్భ ధనలక్ష్మీ(14) అనే బాలిక పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైంది. గిద్దులపుట్టు గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ పనుల్లో భాగంగా సాములు కోత చేస్తున్న సమయంలో పొలంలో పొంచి ఉన్న పాము ధనలక్ష్మీ కాళ్లపై కాటు వేసింది.దీంతో బాలిక సొమ్మసిల్లి పడిపోయి, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటినా ప్రైవేట్ వాహనంలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి సంతోష్ ధనలక్ష్మీకి వైద్య సేవలు అందించారు.సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం బాలిక కోలుకుంటుందని వైద్యాధికారి సంతోష్ చెప్పారు.

ఉక్కుపై బాబు, పవన్ సమాధానం చెప్పాలి

- ఇంత జరుగుతున్నా వారు ఎక్కడున్నారు?
- సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి ఎద్దేవా
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ కార్మికుల ధర్నా



కుటుంబ సభ్యులతో సహా ధర్నాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు (ఇన్‌సెట్) ప్లకార్డు ప్రదర్శిస్తున్న సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌పై ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ ఆ పరిశ్రమ కార్మికులు గాజువాకలో ఆదివారం ధర్నా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులను కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సేవ్ పబ్లిక్ సెక్టార్.. సేవ్ ఇండియా అంటూ నినదించారు. వీఆర్‌ఎస్ పేరుతో కార్మికుల తొలగింపు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజా సమస్యలు పట్టడంలేదన్నారు. ఈ ధర్నాలో వాస్తవానికి చంద్రబాబు కూర్చోవాలన్నారు. ఇంత జరుగుతున్నా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నుంచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం కార్మికులు తమ కుటుంబాలతో నాలుగేళ్లుగా ఆందోళన చేస్తున్నా ఏ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి పట్టడంలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అదానీకో, మిట్టల్‌కో, మరెవరికో కట్టబెడతామంటున్నారని, ప్రైవేట్‌వాడు వచ్చి ఏం ఉద్ధరిస్తాడని ప్రశ్నించారు. ఢిల్లీ తరహాలోనే విశాఖలో కూడా కాలుష్యం దారుణంగా పెరుగుతోందన్నారు. ఇక్కడ భూములు ఎక్కువగా ఉండటం వల్ల కాలుష్యాన్ని నియంత్రించగలుగుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి.దాస్, ఎన్.రామారావు, జి.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, నమ్మి రమణ, కుమారమంగళం, ఆర్‌కేఎస్‌వీ కుమార్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

క్షణకాలంలో కబళించిన మృత్యువు

- నాలుగో అంతస్తు పైనుంచి పడి యువతి మృతి



గాయత్రి (ఫైల్)

పీఎంపాలెం: అప్పటి వరకు ఎంతో చలాకీగా ఉన్న ఆమెను క్షణకాలంలో మృత్యువు కబళించింది. ప్రమాదవశాత్తూ అపార్టుమెంట్ నాలుగో అంతస్తు నుంచి కిందకు పడి మృతి చెందింది. మధురవాడ శివశక్తినగర్‌లోని ఎస్‌వీఎస్ ఫైనేయర్ కాస్టల్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో విషాదం చోటుచేసుకుంది. పీఎంపాలెం ఎస్‌ఐ సునీత తెలిపిన వివరాలివీ.. శివశక్తినగర్‌లోని ఈ అపార్ట్‌మెంట్‌లో జరజాన భద్రాచలం, అతని భార్య ఉషారాణి, కుమారుడు వరాహ రామాచలం, కుమార్తె గాయత్రి(23) నివసిస్తున్నారు. భద్రాచలం యూఎస్‌లో సీమెన్‌గా పనిచేస్తున్నారు. నెల రోజుల కిందట విధులు నిమిత్తం ఆయన యూఎస్ వెళ్లారు. గాయత్రి నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఆదివారం ఉదయం తమ ఫ్లాట్ బాల్కని కింది భాగంను శుభ్రపరచే పనులు చేపట్టింది. బాలక్నికి కొంచెం దిగువన ఉన్న తులసి మొక్కను నీరు పోయడానికి గాయత్రి కిందకు వంగింది. ఈ క్రమంలో అదుపుతప్పి కిందకు పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. కుమార్తె మరణించడంతో ఆమె తల్లి రోదించిన తీరు అందరినీ కలచివేసింది. అపార్ట్‌మెంట్ వాసులు విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పీఎంపాలెం ఎస్‌ఐ సునీత సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి 'చెకుముకి' పోటీల విజేతలకు బహుమతులు

పెందుర్తి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు 48 బృందాలుగా ఏర్పడ్డారు. విజువల్, మౌఖిక, క్విజ్, ప్రాక్టికల్, రాత పరీక్షల విభాగాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి బాపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, విజయనగరం జిల్లా దినకడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, తిరుపతి జిల్లా స్పేస్ సెంటర్ పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి కర్నూలు సెయింట్ జోసెఫ్ స్కూల్ మొదటి, అనకాపల్లి శ్రీప్రకాష్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ, గుంటూరు జిల్లా కొండవీడు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి, బహుమతులు పొందారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, శాస్త్రవేత్తల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

బదిలీల్లో అవినీతి.. విచారణకు మోకాలడ్డు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈవోపీఆర్డీల బదిలీల్లో అక్రమాలు
- 'సాక్షి'వరస కథనాలతో విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- రెండు సార్లు నోటీసులిచ్చినా హాజరుకాని అనకాపల్లి డీపీవో
- తాజాగా విచారణాధికారి పరిధి కుదింపు



మహారాణిపేట: పంచాయతీరాజ్ శాఖలో అడ్డగోలు బదిలీల వ్యవహారంలో సరికొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. అక్రమ బదిలీల ఆరోపణలు ఉన్న జిల్లాలను విచారణకు మినహాయింపు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా అడ్డగోలు బదిలీల వ్యవహారం వెలుగులోకి రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్‌మెంట్(ఈవోపీఆర్డీ) బదిలీలపై విచారణ చేస్తున్న జెడ్పీ సీఈవో పరిధి కుదించడమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి విశాఖ జిల్లాలో సెప్టెంబర్ 22న ఈవోపీఆర్డీల బదిలీ ప్రక్రియను చేపట్టారు. ఇందులో కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్ద పీట వేశారు. అలాగే కొంత మంది ఉన్నతాధికారులు భారీ ముడుపులు తీసుకుని కొందరికి స్థానచలనం కలిగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కొంత మంది ఏకంగా ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేసినట్లు సమాచారం. దీనిపై ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. ఏళ్ల తరబడి గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారు ఈ బదిలీలతో మైదాన ప్రాంతాల్లోకి రావచ్చని ఆశపడ్డారు. అయితే సిఫార్సులు, ముడుపులు కారణంగా వారు గిరిజన ప్రాంతాలకే పరిమితమయ్యారు. బదిలీ ప్రక్రియలో భారీగా డబ్బు చేతులు మారడం కారణంగానే తమకు అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

విచారణకు సహకరించని అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో విచారణ ప్రారంభించారు. అయితే అనకాపల్లి, అల్లూరి జిల్లాల పంచాయతీ అధికారుల నుంచి ఎటువంటి సహకారం అందలేదని తెలిసింది. బదిలీ విషయంలో విచారణకు హాజరుకావాలని ఆ జిల్లాల పంచాయతీ అధికారులకు సీఈవో నోటీసులు జారీ చేశారు. అయితే వారు హాజరు కాకుండా దుమ్మా కొట్టారు. బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులు, తీసుకున్న నిర్ణయాల నివేదికలు కావాలని అడిగినా వారు స్పందించలేదు. దీంతో సీఈవో స్వయంగా ఆయా జిల్లాలకు వెళ్లి సమాచారం సేకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇలా వివరాల కోసం ప్రయత్నిస్తున్న సమయంలో అక్కడి అధికారులు తమ జిల్లాలో తలదూర్చవద్దని.. విశాఖ జిల్లాలో మాత్రమే విచారణ చేసుకోవాలని చెప్పడంతో సీఈవో నిర్ఘాంతపోయినట్లు తెలిసింది.

మినహాయింపుపై అనుమానాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్న సీఈవోపై కూటమి ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా అనకాపల్లి, అల్లూరి జిల్లాలను విచారణ నుంచి మినహాయించేలా ప్రభుత్వంతోనే చెప్పించడం గమనార్హం. దీంతో అక్రమ బదిలీల వ్యవహారంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాలను మినహాయిస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. విచారణాధికారి పరిధిని కేవలం విశాఖకు మాత్రమే పరిమితం చేశారు.

'సాక్షి' కథనాలతో ప్రభుత్వంలో కదలిక

సెప్టెంబర్ 22వ తేదీనే బదిలీల ప్రక్రియను చేపట్టినప్పటికీ.. ఆ జాబితాను ఆ నెల 30వ తేదీ వరకు రహస్యంగా ఉంచడంపై అనేక ఆరోపణలు వినిపించాయి. కేవలం ఈవోపీఆర్డీలకు మెయిల్ పెట్టి చేతులు దులిపేసుకున్నారు. ఈ వ్యవహారం మీద పలువురు ఈవోపీఆర్డీలు విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను కలిసి ఫిర్యాదులు చేశారు. దీనిపై సాక్షి వరస కథనాలు ప్రచురించడంతో ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ఈ బదిలీలపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. విచారణాధికారిగా జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తిని కలెక్టర్ నియమించారు.